

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం, 6 మే 2025 — 8 పేజీలు

ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లాంటివి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లాంటివని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కల్లులా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పట్టించడం జరుగుతుందన్నారు.

2 లో

ప్రజల న్యాయపరమైన సమస్యలను పోలీసులు పరిష్కరించాలి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా ప్రజల న్యాయపరమైన సమస్యలను పోలీసులు ముందుండి పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీస్ అధికారులు ఆదేశించారు. అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి

2 లో

ప్రజా సమస్యలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను హెచ్చరించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

2 లో

గాలివీడులో.. గుప్పుమంటున్న గంజాయి

భావితరాలకు మార్గదర్శకంగా ఉండాల్సిన నేటి యువత గంజాయి ఊబిలో చిక్కుకొని వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. జీవితంలో నిర్ణీత లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన వారు..గంజాయికి బానిసలుగా మారుతున్నారు. చాలాచోట్ల ఆల్కహాల్ తరవాత ఎక్కువ మంది గంజాయి వ్యసనపరులుగా మారుతున్నారు.అందులో ముఖ్యంగా యువత ఉన్నారు. బాగా చదువుకొని పైకి రావాల్సిన చిన్న వయసు గల టీనేజర్లు ఈ గంజాయి మత్తుకు బానిసలు అవుతున్నారు.వీరంతా సాయంత్రం వేళలో కలుసుకుని ఖాళీ ప్రదేశాలు వెంచర్లు అడ్డాగా మార్చుకొని ఈ గంజాయిని సేవిస్తున్నారు. ఎక్కువ శాతం 17 యేళ్లు నుంచి 25 ఏళ్ల వయసు లోపు వారే వీటికి బానిసలు అవుతుండడం గమనార్హం. కొంతమంది యువకులైతే ఈ గాంజాయి మత్తులో లేనిపోని గొడవలకు దిగుతూ వారి ఇంటి వారికి భారంగా మారుతున్నారు. మరి కొంతమంది ఈ మత్తులో ఇతర నేరాలకు పాల్పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

- విశాలాంధ్ర-గాలివీడు

- యువకులు, విద్యార్థులే టార్గెట్
- నిర్మానుష్య ప్రదేశాలే అడ్డాలు

మత్తుకు బానిసలు అవుతున్న యువత

గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు అవుతున్నారు. చిన్న వయసు లోనే గంజాయికి అలవాటు పడి తమ జీవితాలను పోగొట్టుకుంటున్నారు. గంజాయి వాడకం అనంతరం గ్రూపులుగా ఏర్పడి గొడవలకు దిగి ప్రాణాల మీద తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా గాలివీడు పట్టణంలోని పెద్దూరు, బస్టాండ్, గేటు నాలుగురోడ్ల కూడలి, కరిమిరెడ్డి గారి పల్లె, తదితర ప్రాంతాలు స్థావరాలుగా మారాయి. గంజాయిని పీల్చేందుకు బొప్పాయి చెట్టు ఆకుల బొంగులను వినియోగిస్తూ, వాటికోసం బొప్పాయి చెట్ల వద్ద గంజాయి బ్యాచ్ ఎక్కువగా ప్రత్యక్ష మవుతున్నారు.

2 లో

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. వ్యవసాయ శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులకు సూచించారు. సోమవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో.. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి వారి ఆధ్వర్యంలో రెండు రోజుల దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమీక్షా సమావేశం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం గుంటూరు లామ్ పరిశోధన సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డా.జి.శివ నారాయణ, తిరుపతి ఆర్.ఏ.ఆర్.ఎస్. (సౌత్ జోన్) పరిశోధన సహాయ సంచాలకులు డా. వి.సుమతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు, వారి జీవన ఆర్థిక స్థితిని మెరుగు పరచడం కోసం ప్రతి వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారి, రైతు సశ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గత 20 ఏళ్లుగా శాస్త్రీయబద్ధంగా సిద్ధాంత పరంగా.. సూచించిన సూచనలే రైతులు అనుసరించేవారన్నారు. కానీ ప్రస్తుతం రైతులే క్షేత్రస్థాయిలో శాస్తవేత్తలుగా ఎదుగుతున్నారంటే...

2 లో

నగల దొంగలు అరెస్ట్

- రూ.20లక్షలు విలువ చేసే బంగారు నగలు స్వాధీనం: డీఎస్పీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని నరాల బాలిరెడ్డి కాలనీలో జరిగిన నగల దోపిడికి సంబంధించి నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 23.4 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పుతి బావన

2 లో

వేసవి కాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అన్నమయ్య జిల్లా ఇంచార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ ఉషశ్రీ

విశాలాంధ్ర-నందలూరు: వేసవి కాలంలో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఇన్చార్జి డిఎంహెచ్ఓ డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుందా నెల్లూరు గ్రామంలో స్పెషలిస్ట్ డాక్టర్ల చే నిర్వహించబడుతున్న వైద్య శిబిరాన్ని డిఎమ్హెచ్ఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రామచంద్రా రెడ్డి ఆద్వర్యంలో, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా, ఏఎన్ఎమ్లు, ఆశల ద్వారా ఇంటి ఇంటికి తిరిగి లార్వా సర్వే చేసి, ఆశ చే అబేట్ ద్రావణం పిచికారి చేపించడము, సైఫోనేత్రియం ఇన్డోర్ స్ప్రే చేపించడం జరిగినది.

2 లో

పేద విద్యార్థులకు 25శాతం సీట్లు

- ఎంఈవో శివప్రసాద్

విశాలాంధ్ర-యర్రగుంట్ల: విద్యాహక్కు చట్టం కింద పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని మండల విద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించి 1వ తరగతిలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని 25శాతం సీట్లు పేద వర్గాల పిల్లలకు కేటాయింపు ఉంటుందని ఆయన గుర్తుచేశారు. సీబీఎస్ఈ స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని ఈ పథకానికి అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు, తెగలు, బీసీ, మైనార్టీ, ఓసీ, అల్పాదాయ వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హులని ఎంఈవో వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూఢనమ్మకాలపై అవగాహన

విశాలాంధ్ర-యర్రగుంట్ల: స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలయ్యన్న పాల్గొని సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. వాటి నుండి బయట పడేందుకు అనేక మ్యాజిక్‌లు, లాజిక్‌లు పిల్లలకు తెలియజేశారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతిరోజు వివిధ మనో వికాస కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకురాలు ఉమాదేవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్షులు కె.వి.సుబ్బయ్య, పాఠకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-మైదుకూరు: దువ్వూరు మైదుకూరు పరిసర ప్రాంత ప్రజలకు గాయిత్రి ఫెర్టిలిటీ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వారి ఆధ్వర్యంలో దువ్వూరు ఆదర్శ పాఠశాల తెలుగు బడి వద్ద ఆదివారం ఉచిత చికిత్స శిబిరం ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కందుల సుమిత్ర నిర్వహిస్తున్నారు.కావున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చికిత్స శిబిరంలో పాల్గొన్న వారికి ఉచిత కన్సల్టేషన్, ప్రొద్దుటూరులోని హాస్పిటల్‌లో ఉచిత స్కానింగ్, మగవారికి ఉచిత సెమెన్ అనాలసిస్ నిర్వహించడం జరుగుతుంది. గాయిత్రి హాస్పిటల్ డాక్టర్ వీర ప్రసాద్ రెడ్డి తెలిపారు.

బోనాలలో రీ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం బోనాల గ్రామంలో భూముల రీ సర్వేను ప్రారంభించినట్లు తహశీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇది వరకు చిన్నకుడాల గ్రామంలో సెకెండ్ ఫేజ్ కింద రీ సర్వే పూర్తి చేశామన్నారు. అయితే గ్రాండ్ వాల్యుయేషన్ రావాల్సి ఉంది. రీ సర్వే ద్వారా పెండింగ్‌లో భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. అలాగే భూముల సరిహద్దులు ఏర్పాటు చేయడం ద్వారా ఎటువంటి సమస్యలు తలెత్తవన్నారు. ఈ సర్వేకు రైతులు కూడా సహకరిస్తున్నారని ఆయన వెల్లడించారు.

గాలివీడులో.. గుప్పుమంటున్న గంజాయి.!

మొదటి పేజీ తరువాయి

నిర్మానుష ప్రదేశాలే అడ్డాలు..

గంజాయి అమ్మకాలు, కొనుగోలు నిర్మానుష్య ప్రదేశాలను అడ్డాలుగా మార్చుకున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో నిర్మానుష్య ప్రదేశాల్లో గంజాయి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా గాలివీడు పట్టణంలోని రాయచోటి ప్రధాన రహదారి వెంబడి పంట పొలాలు, వెలి గల్లు కుడి కాలువ బ్రిడ్జ్ వద్ద, పట్టణ శివారు ప్రాంతాల్లో గుట్టల్లో వీరి స్థావరాలను ఏర్పర చుకున్నట్లుగా సమాచారం. పోలీసులు ఎప్ప టికప్పుడు నిర్మానుష్య ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. కొందరు వ్యక్తుల సహకారంతో బయట ప్రాంతాల నుండి గంజాయిని తరలించి విక్రయాలు చేపడుతున్నట్లుగా సమాచారం.

ఆరోగ్యంపై చెడు ప్రభావం..

గంజాయికి అలవాటుపడిన యువకులు.. చివరకు అది లేకుండా తాము ఉండలేమనే స్థితికి చేరుకుంటారని వైద్యులు చెబుతున్నారు. ఆ మత్తులో చెడు వ్యసనాలకు, నేరాలకు పాల్పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయాన్ని గమనించక పోవడంతో వారు చెడు సావాసాలతో గంజాయికి బానిసలుగా మారుతున్నారు. గంజాయి సేవించే వారికి చేతులు,కాళ్లు వనకడం, మాట తడపడడం చివరకు మానసిక వైకల్యంతో బాధపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పట్టణానికి చెందిన కొంత మంది యువకులు ఇలాంటి స్థితిలో అక్కడక్కడ తారస పడుతుండటం గమనార్హం.

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలి

మొదటి పేజీ తరువాయి

గర్వించదగ్గ విషయం అన్నారు. కావున వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతులకు కావాల్సిన నిజమైన శాస్త్రీయ పద్ధతులను అందజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎదురయ్యే నిజమైన సమస్యను గుర్తించినపుడే రైతులకు సంపూర్తి స్థాయిలో సహకారం అందించిన వారు అవుతారన్నారు. పరిశోధన అనేది కేవలం తాత్కాలిక లాభాల కోసం జరగకూడదని.. సాగుబడికి, దిగిబడికి, మార్కెటింగ్ కు అనువైన లాభదాయకమైన, మెకనైజేషన్ తోకూడిన నాణ్యమైన పద్ధతులను సూపొందించాలన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను.. రైతులకు ప్రజలకు సీజన్ల వారీగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పరిశోధన సంచాలకులు డా. వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ... రానున్న సంవత్సరంలో వ్యవసాయ పంటల సాగు ప్రాణాళికను సమర్థవంతంగా రూపొం దించి.. రైతులకు లాభదాయకమైన పంట లను ఎంపిక చేయాలని శాస్త్రవేత్తలు, రైతు శాస్త్ర వేత్తలను కోరారు. రాస్ పరిశోధన సహాయ సంచాలకులు డా. వి. సుమతి మాట్లాడుతూ... దక్షిణ మండలము, జిల్లాల విభజన తరువాత తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వై.యస్.ఆర్ కడప, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు మొదలైన ఐదు జిల్లాలుగా ఏర్పాటు కావడం జరిగిందన్నారు. దక్షిణ మండల ప్రాంతీయ పరిశోధనా కేంద్రం పరిధిలో గత ఏడాదిలో వ్యవసాయ సాగుబడిలో సాధించిన పరిశోధన, విస్తరణ ప్రగతిపై... పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, పశు సంవర్ధక శాఖ జెడి డా. శారదమ్మ, మైనర్ ఇరిగేషన్ అధికారులు, దక్షిణ మండల జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి

ఎపిడి మలజిస్ట్ వెంకటేశ్వర్లు పైపు లైన్లో లీకేజీలు గమనించి ఆర్డబ్ల్యుఎస్ వారికి చెప్పడం జరిగింది. అందుకు గాను వారు మరమత్తులు త్వరితగతిన చేస్తాము అన్నారు. త్రాగునీరు నమూనాను పరిశీలనకు పంపడం జరిగినది. అదే విధంగా జిల్లా ప్రజా ఆరోగ్య ప్రయోగశాల నుండి మైక్రోబయాలజిస్ట్ ఉమాపతి ద్వారా రక్త నమూనాలు సేకరించి మలేరియా, టైఫాయిడ్, సీఆర్‌పి, సిబిపి, డెంగీ, ఆర్‌ఏ ఫ్యాక్టర్, చికెన్‌గున్యా, మొదలగు పరీక్షలకి నమూనాలు మదన పల్లెకు పంపడం జరిగినది. అనంతరం ప్రజలకు చేతుల శుభ్రత, ఎండ దెబ్బ, డెంగీ, ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గిరిధర్ (జనరల్ ఫిజీషియన్, ప్రభుత్వ ఆసుపత్రి రాజంపేట), డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్ఓ నారాయణ, సబ్ యూనిట్ అధికారి ఎస్ఎస్ దాస్, జిల్లా మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ శివ, హెల్త్ అసిస్టెంట్స్ మేల్, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణం- శాస్త్రీయ దృష్టి కోణంతోనే సాధ్యం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృష్టి కోణం కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సమీర్ బాషా, బాలబయన్న పిలుపునిచ్చారు. జనజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో కడప నగరంలోని ద్వారకా నగర్ లో ఉన్న జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక కార్యకర్తల కోసం స్టడీ సర్కిల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు సమీర్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో చైతన్యం తీసుకొని రావాలంటే అంధ విశ్వాసాలను ప్రశ్నించే ధైర్యం ఉండాలి అని పేర్కొన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న శాస్త్రానికి(సైన్సు) నిర్వచనం చెబుతూ ప్రతిపాదన ,పరిశీలన, ప్రయోగము, నిర్ధారణ ఇదే సైన్స్ అని తెలిపారు. జెవివి సీనియర్ నాయకులు కుమార స్వామి, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికే నిరూపింపబడిన విషయాలను మన నిత్యజీవితంలో మన భావాలలో, ఆలోచనలలో కూడా వాటిని అన్వయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి సమతా నాయకులు సునీత, అరుణ, కామేశ్వరమ్మ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామరాజు, నగర ఉపాధ్యక్షులు రాయల్ కరీముల్లా, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, కుమారస్వామి సభ్యులు నరసింహారెడ్డి, గోపీనాథ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లాంటివి

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలకు చెందిన 7, రోడ్ల అభివృద్ధికి నాబార్డ్ కింద 4 కోట్లు 16లక్షలు అలాగే ఆర్ఐడిఎస్ కింద 2, కోట్ల 6 లక్షలు శాంక్షన్ చేయించడం జరిగిందన్నారు. ఇందులో మొత్తం 6,కోట్ల 25లక్షల రూపాయలతో రాయచోటిలో ఉన్న నాలుగు మండలాలకు సంబంధించి ఈ ఆరు రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. కేవలం సంక్షేమమే కాదు అభివృద్ధి చేసి చూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్‌సి జెడ్ ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రాయచోటి రూరల్ మండలం సిబ్యాల గ్రామంలో 7 వందల ఎకరాలను కూడా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ ప్రాంతంలో ఎస్ సి జెడ్ తీసుకొచ్చి అక్కడ ఇండస్ట్రియల్ పార్కు నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు అయితే చిన్న పరిశ్రమలు కూడా మన ప్రాంతానికి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతం ఇండస్ట్రియల్ గా అభివృద్ధి చెందినట్లయితే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకంతా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో నియోజకవర్గంలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి నీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి సౌలభ్యం లేని ప్రాంతాలలో ఆర్డబ్ల్యూఎస్ వారి ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఎన్నో ఏళ్లుగా రాయచోటి నియోజకవర్గంలోని 6మండలాలకు నీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఈ సమస్య వచ్చే వేసవి కాలాని కల్లా తీర్చేందుకు సుమారు 300కోట్ల రూపాయలతో రాయచోటి నియోజకవర్గంలోని 6 మండలాలకు వెలిగల్లు నుంచి నీటిని అందించే బృహత్తరమైన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ కింద టెండర్లు పిలవడం జరిగిందన్నారు. మండిపల్లి నాగిరెడ్డి శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద ఉండే 25 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందించి ఆ చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద గత ప్రభుత్వంలో ఏవైతే పనులు నిలిచిపోయాయో అవన్నీ కూడా పూర్తి చేసేందుకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 320కోట్ల రూపాయలు రిలీజ్ చేయడం జరిగిందన్నారు. అది కూడా వచ్చే నెలలో టెండర్లు పిలిచి వచ్చే 8, 9 నెలల్లోనే హంద్రీనీవా హెచ్ ఎన్ఎస్ఎస్ ఫేజ్ -2, కింద శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు. రాయచోటి మండలానికి చెందిన ఇంజేటి భాగ్యమ్మ మూడు సంవత్సరాల క్రితం తన భర్త చనిపోయాడని, తనకు వితంతు పింఛను వచ్చేలా చూడగలరని, పెద్దతిప్ప సముద్రం మండలానికి చెందిన శివరాం తనకు వచ్చే వికలాంగ పించను గత ప్రభుత్వంలో తొలగించబడిందని వికలాంగ పింఛనును పునరుద్ధరించాలని, వయల్పాడు మండలానికి చెందిన తాను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని, వెంకటరమణ తనకు పెరాలసిస్ సోకిందని, తనకు దగ్గరగా ఉండే పాఠశాలలో బదిలీ చేయగలరని జిల్లా కలెక్టర్కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్ డిసి రాఘవేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల న్యాయపరమైన సమస్యలను పోలీసులు పరిష్కరించాలి

మొదటి పేజీ తరువాయి

వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవిం చుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదిక ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని, ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎండ వేడిమికి ఉపశమనం కలిగేలా ఫిర్యాదు దారులకు ఎస్పీ ఆదేశాల మేరకు, మజ్జిగ చల్లని నీరు పోలీసులు పంపిణీ చేశారు.

నగల దొంగలు అరెస్ట్

పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదిన రాత్రి నరాల బాలిరెడ్డి కాలనీలో దొంగతనం జరగడంతో 17వ తేది త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్లట కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక బలగాల ద్వారా దొంగల కోసం గాలించడం జరిగిందన్నారు. సోమవారం అనగా మే 5వ తేది జమ్మల మడుగు బైపాస్ రోడ్డు తిమ్మయ్య కాలనీ వద్ద కర్ణాటక రాష్ట్రం బెల్గాం సిటీ జిల్లాకు చెందిన ఖాజా రఫీక్ సయ్యద్, అర్మాన్ ఇర్ఫాన్ షేక్ మెహబూబ్ ఇబ్రహీం ముల్లాతో పాటు అనంతపురం జిల్లా గుంతకల్ మండలం నక్కలదొడ్డి కొట్టాలకు చెందిన సయ్యద్ అక్బర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 23.4తులాల బంగారు నగలు దాదాపు 20లక్షలు విలువ చేసే నగలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, అరుణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

17రోజుల సమ్మె ఒప్పందాల జీవోల జారీకై ధర్నా

- బెనిఫిట్స్ లేకుండా రిటైర్మెంట్ చేయడం హేయమైన చర్య

విశాలాంధ్ర-బద్వేలు: మున్సిపల్ ఉద్యోగ కార్మికులు గత సంవత్సరం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త 17 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బద్వేలు మున్సిపల్ వర్కర్స్ఏ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబర్ 26 నుండి 2024 జనవరి 11వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 17 రోజుల సమ్మె ఫలితంగా ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ క్రింద 75 వేల రూపాయలు చెల్లిస్తామని, దహన సంస్కారాల ఆర్థిక సహకారాన్ని 20 వేలు చెల్లిస్తామని, ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతామని తదితర అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకొని నేటికీ ఏడాదిన్నర కావస్తున్న నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాల జీవోలను జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా 60 సంవత్సరాల నిండాయనే నెపంతో కార్మికులను బలవంతంగా పదవీ విరమణ చేయడం హేయమైనా చర్యని, స్థానిక మున్సిపాలిటీలో ప్రతినిత్యం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తూ శ్రమిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికార పాలకవర్గాలు చిత్తశుద్ధి కనపరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికార,పాలకవర్గాలు కృషి చేయాలని లేని పక్షంలో రాబోవు కాలంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కాలువ నాగేంద్రబాబు, పట్టణ నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్,యూనియన్ అధ్యక్షుడు పులి శ్యామ్ ప్రవీణ్,ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ, సహాయ కార్యదర్శులు నాగరపు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య,తేళ్ల కిరణ్, పి.పి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ బద్వేలు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక

విశాలాంధ్ర-బద్వేలు: అఖిల భారత యువజన సమాఖ్య బద్వేలు పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లె ప్రభాకర్ తెలిపారు. నూతన ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా లోకేష్ కార్యదర్శిగా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలు యువత హక్కుల పైన స్థానిక సమస్యల పైన భవిష్యత్ పోరాటాలు చేసేందుకు కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు ఈనెల 15నుండి 18వరకు ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో జరుగుతున్నాయని దేశంలో ఈ రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు యువత హక్కులు ఉపాధి పైన భవిష్యత్ కార్యాచరణకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా యువత వేలాదిగా పాల్గొంటున్నారని మన జిల్లా నుండి కూడా యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మరో తొమ్మిది మందితో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది.

అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: ఎన్ఎమ్‌యుఏ

విశాలాంధ్ర-పులివెందుల: అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయల్లో ఎన్ఎమ్‌యుఏ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపో నందు వివిధ రూట్లు నందు తిరుగుచున్న బస్సులకు సరిపడా రన్నింగ్ సమయం ఇప్పించుటకు, చట్టప్రకారం పనిగంటలు అమలు చేయాలన్నారు. చనిపోయిన సిబ్బంది కుటుంబానికి దీర్ఘకాలికంగా పెండింగ్ నందు ఉన్న ఉపాధి కల్పించుటకు, అదే విధంగా ప్రభుత్వపరంగా పెండింగ్ నందు ఉన్న వారి సెటిల్మెంట్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. గత కొంతకాలం నుండి ఈ డిపోలో సర్వీసు తక్కువ పేరిట తొలగించిన బస్సులు తిరిగి ఏర్పాటు చేయాలన్నారు. సంస్థ నందు పనిచేయుచున్న సిబ్బంది దీర్ఘకాలికంగా వివిధ కారణాలతో మెడికల్గా అన్‌ఫిట్ అయి, ప్రత్యామ్నాయ ఉపాధి గాని, లేక వారి ఫ్యామిలీకి గాని ఉపాధి లేకపోవటం వలన పడుచున్న ఇబ్బందులు దృష్ట్యా ఆ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కనీస చదువు గాని, అనారోగ్యంతో ఉన్న డ్రైవర్లను బలవంతంగా టిమ్లకు పంపించటం వలన కలుగుచున్న ఇబ్బందులు వలన వాటిని నిలుపుదల చేయాలని కోరారు. సంస్థ నందు వివిధ కేటగిరీలలో దీర్ఘకాలికంగా పెండింగ్ నందు ఉన్న ఖాళీలు భర్తీతో పాటు ప్రభుత్వం వద్ద పెండింగ్ నందు ఉన్న ప్రమోషన్స్ వెంటనే అమలు చేయాలని వెల్లడించారు. గత నాలుగేళ్లగా పెండింగ్ నందు ఉన్న సరండర్ లీవుల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకులంగా స్పందిస్తుందని వారు కోరారు. కార్యక్రమంలో పులివెందుల డిపో చైర్మన్ జె.వి. రమణ, అధ్యక్షులు ప్రభాకర రెడ్డి, డిపో సెక్రటరీ కేశవ రెడ్డి, డిపో నాయకులు డి.పి.రెడ్డి, ఎన్.ఏ.నారాయణ, పి.వి.నారాయణ, పి.వి.ఎస్. రెడ్డిలు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియా రక్త పరీక్షలు తప్పనిసరి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ప్రస్తుత పరిస్థితులలో 40 ఏళ్ళ వయస్సు దాటిన వ్యక్తులు ఆరోగ్య పరీక్షలతో పాటు సికిల్‌సెల్ అనీమియా రక్తపరీక్షలు తప్పని సరిగాచేయించుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్రఫీ అన్నారు సోమవారం మండలంలోని శికారి పాళెంలో చింతపర్తి పీహెచ్సి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామస్థుల సమావేశాన్ని ఉద్దేశించి టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా గురించి వివరించారు. తదుపరి ముందస్తు పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధులను ఆదిలోనే పసిగట్టి మంచి వైద్యం చేసుకునే వెసులుబాటు ఉంటుందని, వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రతిఒకరికీ శ్రద్ధ ఉండాలని సూచించారు. తదుపరి గ్రామంలో వ్యాధులు, వాటి నివారణ గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యసిబ్బంది గుర్రమ్మ, సులోచన, గ్రామస్థులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల ఇబ్బందులను తీర్చండి సారూ

విశాలాంధ్ర-వాల్మీకిపురం: ప్రభుత్వ చౌకదుకాణాల్లో సరుకులు పొందేందుకు లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని స్థానిక భాజపా మండల పార్టీఅధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ సోమవారం స్థానిక తహసీల్దార్ పామిలేటికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, సరుకులు పంపిణీలో ఒక నిర్ణీత సమయం, దినాలు లేక పోవడంతోపాటు, ప్రస్తుతం అనుసరిస్తున్న పంపిణీ వ్యవస్థ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావని, గత రెండేళ్లుగా ఉదయం 4గంటలకే రేషన్ షాపుల దగ్గర ప్రజలు బియ్యం కోసం పడికాపులు కాస్తున్నార న్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్యలున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధకరమని, తక్షణమే బియ్యం పంపిణీ వ్యవస్థల్లో మార్పులు చేసి ప్రభుత్వ రాయితీ సరుకులు పొందేందుకు దుఖాణాలకు గతంలో వలే నిర్ణీత సమయాన్ని కేటాయించాలని వారు కోరారు తక్షణమే ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోయి సమస్యలను పరిష్కరించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు టైలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన మామిడి రైతులకు బీమా అందించాలి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన మామిడి రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇన్సూరెన్స్ అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి అన్నారు. సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందించారు. రంగారెడ్డి మాట్లాడుతూ సంవత్సరానికి ఒక్కసారి మామిడి పంట వస్తుందని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అయితే మామిడి రైతుకు నిరాశ చేదు అనుభవం ఎదురైంది. సుండుపల్లె, వీరబల్లె, రామాపురం, కలకడ, గుర్రంకొండ, చిన్నమండెం, గాలివీడు, రాయచోటి మండలాలలో వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ సంవత్సరం మామిడి తోటలు డిసెంబర్లో పూత రావాల్సి ఉండగా ఫిబ్రవరి మొదటి వారంలో మామిడి తోటలన్ని పూత ఇరగ పూసింది పూతను చూసిన రైతులు ఆనందముతో ఈసారి బలమైన కాపు కాస్తాదని అనుకున్నారు. జిల్లావ్యాప్తంగా మామిడి తోటల రైతులను సమావేశపరిచి వారి తోటలను పరిశీలించి నష్టపరిహారం అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరినాధ నాయుడు, బాలకృష్ణారెడ్డి, కెవి రమణ కోరుతున్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- రూ.10కోట్లతో రోడ్లు ఏర్పాటు
- మాలేపాడు-ఎర్రగుంట్ల బిటి రోడ్డుకు రూ.4కోట్లు
- చిలమకూరు సానానగర్ పనులకు రూ.1.70కోట్లు
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ 'ఆది' చొరవతో పనులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల: గ్రామీణ రహదారులను బాగు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం ముందుకొచ్చింది. బాగా దెబ్బతిని అధ్వాన్నంగా ఉన్న మార్గాలను నవీకరణ చేయాలని నిర్ణయించారు. రహదారుల బాగోగులను గత ఐదేళ్ల వైకాపా పాలనలో గాలికొదిలేశారు. నరకదారుల్లో పల్లెవాసులకు ప్రయాణం ప్రయాసగా మారింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి సూచనల మేరకు చేపట్టాల్సిన పనులను సాంకేతిక నిపుణులు గుర్తించారు. ఈ విషయాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు ఆది చొరవతో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.10కోట్లు మంజూరు కానున్నాయి. ఇందులో రూ. 4కోట్లతో మాలేపాడు- ఎర్రగుంట్ల గ్రామాల మధ్య బిటి రోడ్డు ఏర్పాటుకు ఖర్చు చేయనున్నారు. మరో రూ. 1.70 కోట్లతో చిలమకూరు గ్రామం సానానగర్‌లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఖర్చు చేయనున్నారు. స్థానికులు దశాబ్దాల కాలంగా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న నేపథ్యంలో ఈ కాలనీలో రోడ్డు, మురుగుకాలువలు నిర్మించడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తలంచి ఆ మేరకు పనులు చేపడుతున్నారు. మిగిలిన మొత్తాన్ని గ్రామీణ ప్రాంత రహదారుల పనులకు ఖర్చు చేయనున్నారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపుతుండడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘటికాచలక్షేత్ర కోశాధికారిగా తోటంశెట్టి చంద్రశేఖర్

విశాలాంధ్ర-వేంపల్లి: తమిళనాడులోని షోలింఘర్ పరిధిలో ఆర్యవైశ్యులు నిర్వహిస్తున్న అఖిల భారత ఘటికాచలక్షేత్ర నిత్యాన్నదాన సమాజం నూతన కోశాధికారిగా వేంపల్లెకి చెందిన తోటంశెట్టి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. నిత్యాన్న దాన సమాజం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా ప్రొద్దుటూరుకు చెందిన కామిశెట్టి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి పసుపుల సుబ్రమణ్యం, అలాగే వేంపల్లెకు చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ కోశాధికారిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే వేంపల్లెకు చెందిన వల్లకుంట వీరయ్య గౌరవ జీవిత సలహా సభ్యునిగా, కాకుమాని సత్య నరసింహులు, తోటంశెట్టి నవీన్ కుమార్ కార్యదర్శులుగా, సహాయ కార్య దర్శిగా తోటంశెట్టి పెద్ద పుల్లయ్య, సభ్యులుగా మేడా ప్రసాద్, కర్నాటి నాగేంద్ర బాబు, రాయవరం రవీంద్ర బాబు, బైరిశెట్టి బాలగం గాధర్, పుల్లగూర అరవింద్, మధుసూదన్ గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. తమ పదవీ కాలంలో అన్న దాన సమాజాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి: కాంగ్రెస్

విశాలాంధ్ర-వేంపల్లి: ప్రకృతి వైపరీత్యాల కారణంగా పెండ్లిమర్రి మండలంలో దెబ్బతిన్న అరటి రైతులను వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనరు మహబూబ్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఈదురుగాలు రావడం సహజమే అన్నారు. అయితే ఈ పెనుగాలులు అరటి తొటలపై పడ్డాయని, దీని వల్ల రైతుల కష్టం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి వెచ్చిందన్నారు. దిగుబడి దశలో పెనుగాలుల వల్ల అరటితోటలు నేలకొరడం పట్ల సాగు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. దిగుబడి చేతికందే దశలో అరటిపంట నేలపాలవ్వడం బాధిస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాల గండం తప్పిపోవాలనే కాంగ్రెస్ కోరుకుంటుందన్నారు. కానీ అనుకోకుండా వచ్చిన ఈ ఈదురుగాలుల వల్ల అరటి రైతులకు కోలుకోలేని దెబ్బతగిలిందన్నారు. ఇదిలావుండగా ఖరీఫ్ సీజన్ సమయం కూడా దరిదాపుల్లో ఉందన్నారు. అరటి పంట దెబ్బతీసినా తదుపరి పంటలను సాగు చేసేందుకు రైతుల వద్ద చిల్లిగవ్వ కూడా లేదన్నారు. ఆర్థికపరంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. అరటి రైతులకు న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్‌పార్టీ పోరాటం చేస్తుందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-వేంపల్లి: వేసవి విజ్ఞాన కేంద్రాలతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంధాలయ అధికారిణి వనజ కుమారి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతులు గత నెల 28 నుంచి ప్రారంభం అయ్యాయి. సోమవారం విశ్రాంత ఉపాధ్యాయుడు పి.వెంకటరామిరెడ్డి పాల్గొని విధ్యార్థులకు కథలు చెప్పారు. ఈ తరగతులు వచ్చే నెల 6వ తేదీ వరకు జరుగుతాయని, వేసవి సెలవుల నైపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను విజ్ఞాన శిబిరానికి పంపి సద్వినియోగం చేసుకోవాలని వనజ కుమారి కోరారు. విద్యార్థులకు గ్రంధాలయాలు జ్ఞానం ప్రసాదించే దేవాలయాలని, పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదతో పాటు మానసికాభివృద్ధి సొంతం చేసుకోవచ్చన్నారు.

ముస్లిం మైనారిటీలపై వైసిపిది మొసలి కన్నీరు

- డాక్టర్ తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ముస్లిం మైనారిటీల పట్ల వైసిపిది మొసలి కన్నీరని వక్ఫ్ సవరణ చట్టంపై డబుల్ గేమ్ ఆడుతోందని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ లోక్ సభలో వక్ఫ్ సవరణ చట్టానికి వైసిపి వ్యతిరేకంగా ఓటు వేసింది.కానీ రా జ్యసభలో అనుకూలంగా ఓటు వేసింది. డబుల్ గేమ్ ఆడిందన్నారు. పౌర సత్వ సవరణ చట్టానికి కూడా బిజెపికి అనుకూ లంగా వైకాపా ఓటువేసిందని తెలిపిరు. వైసిపి స్థిరత్వం లేని పార్టీ, ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా అంటే చెప్ప లేనంత భయం ఉందన్నారు. బిజెపి చేతిలో టిడిపి, జనసేన, వైకాపాలు కీలు బొమ్మలుగా మారారన్నారు. రాష్ట్రం లో బిజెపి అంటే అర్థం వేరు. బి అంటే బాబు, జెఅంటే జగన్, పి అంటే పవన్ అని అన్నారు.

బీటీ కళాశాలలో తొలగించిన కోర్సులను పునఃప్రారంభించాలి

- నిరుపేద విద్యార్థులకు అండగా నిలవాలి
- బివైఎస్ వ్యవస్థాపకుడు పునీత్ డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లె: పట్టణంలోని చారిత్రాత్మక బీటీ కాలేజ్ నందు గతంలో తొలగించిన ఇంటర్మీడియట్ కోర్సులు,ఎయిడెడ్ పీజీ కోర్సులను 2025-26 నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పునఃప్రారంభించాలని, కాలేజీని యూనివర్సిటీగా ప్రకటించాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కి సోమవారం బహుజన యువసేన (బివైఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు పునీత్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్ర గల బెసెంట్ థియోసాపికల్ కాలేజ్ (బీటీ) ఈ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఇంటర్మీడియట్ కోర్సులను అలాగే ఈ రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా పీజీ కోర్సులను మొదలు పెట్టడం జరిగిందని, అలాంటి చరిత్ర కలిగిన కాలేజీలో అన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులను గతంలో ఉన్న ప్రైవేటు యాజమాన్యం ఇంటర్మీడియట్ కోర్సులను తొలగించడం జరిగిందని,వాటితోపాటు పీజీ ఎయిడెడ్ కోర్సులను కూడా తొలగించడం జరిగిందన్నారు.దీంతో ఎంతోమంది పేద విద్యార్థులు కార్పొరేట్ మరియు గవర్నమెంట్ కాలేజీల్లో ఫీజులు చెల్లించి చదువుకోలేక, బీటీ కాలేజీ నందు చదువుకుందామంటే ఆ కాలేజీ నందు ఇంటర్మీడియట్ కోర్సులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు.అలాగే ఉన్న కోర్సులకు చేరిన విద్యార్థులకు సరైన సర్టిఫైడ్ స్టాఫ్ లేక సరైన మెయింటెనెన్స్ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని,కనీసం బాలికలకు గర్ల్స్ కాలేజ్ మరియు ఉమెన్స్ కాలేజీలు ఉన్నాయని ,బాలురులకు ఒక గవర్నమెంట్ ఇంటర్ కాలేజ్ గాని, డిగ్రీ కాలేజ్ గాని లేదని ఆయన ఆరోపించారు.కావున బీటీ కళాశాలలో వెంటనే గతంలో తొలగించిన కోర్సులను ప్రారంభించాలని,గత ప్రభుత్వం వారు 2022లో బీటీ కాలేజీను ప్రభుత్వ పరం చేస్తున్నట్టు ఒక జీవోను విడుదల చేశారని, జీవోను విడుదల చేసినప్పటికీ ఆ రోజు నుండి ఈరోజుటి వరకు గత ప్రభుత్వం వారు గాని,ప్రస్తుత ప్రభుత్వం వారు గాని కాలేజీని హ్యాండ్ ఓవర్ చేసుకోకుండా,ఇచ్చిన జీవో కేవలం గాలిలో దీపం లాగా ఉంచి ఆ జీవోపైన స్పష్టత ఇవ్వకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారే గాని కాలేజీను మాత్రం ప్రభుత్వం వారు హ్యాండోవర్ చేసుకోవడం లేదని విమర్శించారు. అలాగే గతంలో ఇప్పటి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 6 కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన బీటీ కాలేజ్ మ్యూజియం నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయి, కోట్ల రూపాయలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయిందన్నారు.కావునపై తెలిపిన సమస్యలపై అనేకసార్లు ఉన్నతాధికారులకు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని,కానీ సమస్యపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా దయవుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా బీటీ కాలేజ్ నందు గతంలో తొలగించిన కోర్సులను తిరిగి ప్రారంభించి,మరీ ముఖ్యంగా ఇంటర్మీడియట్ కోర్సులను వెంటనే ప్రారంభించి అడ్మిషన్స్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పునీత్ కోరారు.అలాగే 2022న విడుదల చేసిన జీవో ప్రకారం బీటీ కాలేజీని ప్రభుత్వం వారు హ్యాండోవర్ చేసుకొని యూనివర్సిటీగా ప్రకటించాలని, వీటితోపాటు కోట్ల రూపాయలతో నిర్మించిన మ్యూజియం భవనాన్ని నిరుపయోగంగా, అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా చర్యలు తీసుకొని, ఆ భవనం పనులను పూర్తి చేసి ఉపయోగపడేలాగా చర్యలు తీసుకోవాలని తద్వారా ఎంతో చరిత్ర గల బీటీ కాలేజీకి పూర్వ వైభవం తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన యువజన నాయకులు జిలాని బాషా, హరికృష్ణ, శశి కుమార్, వినయ్, బ్రహ్మ, గౌతమ్, బాలకృష్ణ, సతీష్, శశి కుమార్, దినేష్, రాజేష్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందిన మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపంలోని మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాల నందు బి.టెక్ చదువుతున్న 170 మంది విద్యార్థినిలకు ఏఐసీటీఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి), న్యూ ఢిల్లీ మెరిట్ స్కాలర్‌షిప్ లు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి యువరాజ్ అన్నారు. చదువుకోవాలి అనే ఆలోచన, తెలివితేటలు ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరమవుతున్న అమ్మాయిలకు ఏఐసీటీఈ స్కాలర్‌షిప్ పేరిట భరోసా కల్పిస్తోంది అని, ఆర్థికంగా అండగా నిలవడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) న్యూ ఢిల్లీ వారు ఇంజినీరింగ్ చదువుతున్న అమ్మాయిల కోసం ప్రగతి స్కాలర్‌షిప్ పేరుతో స్కాలర్‌షిప్‌లు ఏర్పాటు చేసింది అని అన్నారు. ఎంపిక అయిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ. 85 లక్షలు అందించినట్లు ఆయన అన్నారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా, మౌలాలి తదితరులు అభినందనలు తెలియజేసారు.

రాష్ట్రంలో కనీస వేతన బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలి

- కనీస వేతనం నెలకు రూ.35 వేలు నిర్ణయించాలి
- సబ్ -కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ధర్నా

విశాలాంధ్ర-మదనపల్లె: ఆకాశాన్నంటుతున్న ధరలు,విద్య వైద్యం,శాస్త్ర సాంకేతికాభివృద్ధితో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కనీస వేతనం రూ.35 వేలు అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కనీస వేతన బోర్డును నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్పలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం మదనపల్లి సబ్ -కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాశాన్ని అంటుతున్న ధరలు, విద్య,వైద్య శాస్త్ర, సాంకేతికాభివృద్ధితో పెరుగుతున్న అవసరాలు, ఇంటి అద్దెలు, తదితర అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఒక కుటుంబం గౌరవ ప్రదంగా జీవించాలంటే నెలకు కనీసం రూ.35 వేలు అవసరమని, అందుకు అనుగుణంగా జోవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులకు లక్షలాది రూపాయలు వేతనాలు పెంచిన పాలక ప్రభుత్వాలు దేశంలో సంపద సృష్టిస్తున్న కార్మిక వర్గానికి ఎప్పుడో ఏళ్ల క్రితం ఉన్న వేతనాలతో, వేతనాలు పెంచకుండా కార్మిక శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్మికసంఘాలతో సంప్రదింపులు జరిపి, కనీస వేతనాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు దేవా, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, ఉపాధ్యక్షుడు వాసు,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇంద్రాణి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35వేలకై ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన ధర్నా

విశాలాంధ్ర-కడప రూరల్: దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలోనూ షెడ్యూల్ పరిశ్రమల్లో పని చేస్తున్న లక్షల మంది కార్మికుల కనీస వేతనాలను 35 వేల రూపాయలుకు సవరించాలని కోరుతూ ఏఐటీయూసీ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి, అధ్యక్షులు జి. వేణుగోపాల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లాలు మాట్లాడుతూ అనేక షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాలను 7 నుంచి 12 సంవత్సరాలుగా పెంచలేదని ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కష్టజీవులు శ్రమ దోపిడి గురవుతున్నారని అప్పుల పాలై ఆకలి పస్తులతో అల్లాడిపోతున్నారని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు కరెంటు చార్జీ ఇంటి అద్దెలు దీనివల్ల లక్షలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థల్లో, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానాల్లో లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేసేందుకూ కూటమి ప్రభుత్వం ఏడాది కావస్తున్నా కార్మిక వర్గ సంక్షేమానికి ఒక్కు అడుగు ముందుకు వేయలేదని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి వర్కర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు, పెద్ద ఎత్తున పోరాటం చేశారని గుర్తు చేశారు. మీకు న్యాయం చేస్తామని నాడు ఆ టెంట్లు చుట్టూ తిరిగిన టిడిపి, జనసేన నాయకులు ఇచ్చిన హామీల సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ధర్నా అనంతరం స్పందనలో డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడుకి వినీత పత్రం సమర్పించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి జిల్లా కార్యదర్శి కే లింగన్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు నరసింహులు జాన్ వెంకటాద్రి మేలింగే రాజశేఖర్ ఈశ్వరయ్య ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీనరసమ్మ నిర్మల ప్రియదర్శిని ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక నాయకురాలు సులోచనమ్మ మేరీ పార్వతమ్మ అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సరోజ ఆయా యూనియన్ నాయకురాలు కుమారి షాకిర మంజుల తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర వాల్మీకి యూత్ వింగ్ అధ్యక్షులు బండి వెంకట సాయి

విశాలాంధ్ర-గాలివీడు: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆర్‌వీఎస్ రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షులు బండి వెంకట సాయి డిమాండ్ చేశారు. సోమవారం గాలివీడు మండలంలోని పక్కీరారెడ్డిగారిపల్లె, బురుజు పల్లి- 2,గోరాన్ చెరువు, గుండ్లచెరువు, తూముకుంట, ప్రకాష్ నగర్ కాలనీ గ్రామాల్లో ఆర్‌వీఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆదేశాల మేరకు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సం. 2019 లో కర్నూల్ మహా సభలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న ప్రధానమంత్రి హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయల విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 341,342,29(డి) లు అమలు కావడం లేదని, రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని ప్రధాని చొరవతో తమ సమస్యను పరిష్కరించాలని వారు స్పష్టం చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు బండి సా యినాథ్, ఆర్‌వీఎస్ గాలివీడు యూత్ ప్రధాన కార్యదర్శి ముండ్ల నరసింహులు, జనరల్ సెక్రెటరీ సాయిబోధ, ఆంజనేయు లు, రెడ్డి కిషోర్, బాలాజీ, పావని, రమాదేవి, లలిత, పండు, హిమబిందు, భవానీ పాల్గొన్నారు.

కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

దళితులకు భూమి, ఉద్యోగం, బ్యాంకు రుణాలు అందించాలి - బాస్ జెండా ఆవిష్కరణ సభలో శివప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లె: మత ఉగ్రవాదం కంటే కుల ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరమని, కఠిన చర్యలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మదనపల్లి రూరల్ మండలంలోని పనసమాకులపల్లి నందు సోమవారం బాస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శివప్రసాద్ కు స్థానికులు ఘనస్వాగతం పలికి, అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈసందర్భంగా శివప్రసాద్ గ్రామస్తులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. ఆతర్వాత గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్దించి 78 సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ కుల వివక్ష తొలగిపోలేదని, కుల ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని, కొన్ని చోట్ల పాలకులే కుల ఉగ్రవాదుల్ని తయారు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు వీలైనంత త్వరగా కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, లేకుంటే దేశంలో కులాల మధ్య యుద్ధం తప్పదని హెచ్చరించారు. పనసమాకులపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నక్క నాగరాజు ఆధ్వర్యంలో, బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో బాస్ రాష్ట్ర నాయకులు నీరుగట్టి రమణ, టి.ఎ. పీర్ బాషా, మలారి గిరిబాబు, బాస్ మరియు వీసీకే నాయకులు వై. గంగాధర్, సొన్నికంటి రెడ్డెప్ప రెడ్డిప్రసాద్, జి.వి. రమణ, వై. చిన్నా, సురేష్, రవిశంకర్ లతోపాటు స్థానిక బాస్ ప్రతినిధులు కాంతమ్మ, రెడ్డెమ్మ, సుకన్య, హరినాథ్, నరసింహులు, కృష్ణప్ప, సుబ్రహ్మణ్యం, మిట్టమర్రి నారాయణలతోపాటు పనసమాకులపల్లి, మిట్టమర్రి, పిచ్చలవాండ్లపల్లి గ్రామాలకు చెందిన దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానించిన కడప పీఠాధిపతులు

విశాలాంధ్ర -మదనపల్లె: కలిచర్లలో వెలిసిన మౌలాక గ్రంథం మరియు ఉరుసు ఉత్సవాలను ఈనెల 8వ తేదీ అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు కడప దర్గా పీఠాధిపతులు అమీన్పీరి బాబా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలాక పహాడ్ ఉరుసు ఉత్సవాలు హిందూ ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిర్వహించడం మానవాళిత అని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు అనంతరం గజమాలతో సత్కరించారు

ఘనంగా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు 63వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సుధాకర్ నాయుడు జన్మదిన వేడుకలలో పంచాయితీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలలో పాల్గొని సుధాకర్ నాయుడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సుధాకర్ నాయుడు కు శాలువులతో ఘనంగా సన్మానించి కేకు కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో రవిశంకర్ రెడ్డి, పంచాయతీ ఉప సర్పంచ్ రాళ్లపల్లి రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ షరీఫ్, ఇమామ్ హుస్సేన్, రమణ గడ్డం వెంకటేశ్వర్లు, ధర్వేశ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర-అట్లూరు: అట్లూరు మండలం సోమశిల పునరావాస కాలనీ కుంభగిరి గ్రామపంచాయతీ ఎస్ వెంకటాపురం, అక్కి రెడ్డి గారి పల్లె అరుంధతివాడలోని పోత్తపి. చిన్నయ్య(54) మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కడప ఉమ్మడి జిల్లా నూతన డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్య నారాయణ రెడ్డి సోమవారం హుటాహుటిన మృతుని నివాసం ఎస్ వెంకటాపురం అక్కి రెడ్డి గారి పల్లి అరుంధతి వాడకి వచ్చి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఆటో బోల్తా పడి న ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరమని మృతుని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల క్రియాశీల నాయకులు ఆరవ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ ఇంచార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నవీన్ రెడ్డి, కొమ్మూరుగురు ప్రసాద్ రెడ్డి,మట్లి. ఈశ్వర్ రెడ్డి, కాసల ట్రైలర్ ఐవారయ్య, కొండూరు.వేణు గోపాల్, వరికుంట గోపాలయ్య, పొత్త పి. సునీల్, కోటపాటి పెంచలయ్య, పరశురాముడు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

అధికారులు ఇంటి నిర్మాణదారులకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మునిసిపల్ అధికారులు ఇంటి నిర్మాణదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణదారులు బిల్డింగ్ ప్లాన్ పొందే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ లైసెన్స్‌డ్ పర్సనల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వై. ఎస్. ఆర్.కడప జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యమ్.కుమార మంగళం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్రప్రదేశ్ మునిసిపల్ శాఖవారు పట్టణ ప్రాంతాలలో భవన నిర్మాణ అనుమతుల రూల్స్ లో ఇటీవల ప్రవేశపెట్టిన "సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం లో ఉన్న షరతులతో ఎల్ టి పి టెక్నీషియన్లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరగా బిల్డింగ్ ప్లాన్లు అనుమతి వచ్చే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు ఈ విధానం పై అవగాహన కల్పించాలని కోరారు. ఈ విధానము వలన లైసెన్సుడు టెక్నికల్ పర్సన్స్ మూడు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుదారులు ఇబ్బంది పడకుండా బిల్డింగ్ ప్లానింగ్ తీసుకునేందుకు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొన్ని సవరణలు చేయాలని మేము కోరుతున్నామన్నారు. ఇలానే వదిలేస్తే అనుమతులు లేని భవనాలు గుట్టలు గుట్టలుగా వెలుస్తున్నాయని తెలిపారు.

వీఆర్ఏ లకు పదోన్నతి

విశాలాంధ్ర- మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లో పనిచేస్తున్న 20 మంది వీఆర్ఏ పదోన్నతి కల్పిస్తూ మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్ పరిధిలో పనిచేస్తున్న 15 మంది విఆర్ఏ లకు సబార్డినేట్ గా మరో ఐదు మంది వీఆర్ఏ లకు వాచ్ మ్యాన్ లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వీఆర్ఏ లు వీఆర్ఏ లు సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఆర్ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పోరుమామిళ్ల పట్టణంలోని సచివాలయం -1. 2, 3. 4 అకస్మాత్తుగా తనిఖీ చేశారు. పలు అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సచివాలయాల్లో సిబ్బంది గైర్హాజరవుతున్నట్లు ఫిర్యాదులు అమ్ముతున్నాయని చెప్పారు. సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను కూడా గడువులోపు పూర్తిచేయాలని సూచించారు.

సమాచార చట్టం-2005పై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-మదనపల్లె: మత ఉగ్రవాదం కంటే కుల ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరమని, కఠిన చర్యలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మదనపల్లి రూరల్ మండలంలోని పనసమాకులపల్లి నందు సోమవారం బాస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శివప్రసాద్ కు స్థానికులు ఘనస్వాగతం పలికి, అంబేడ్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈసందర్భంగా శివప్రసాద్ గ్రామస్తులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. ఆతర్వాత గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్దించి 78 సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ కుల వివక్ష తొలగిపోలేదని, కుల ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని, కొన్ని చోట్ల పాలకులే కుల ఉగ్రవాదుల్ని తయారు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు వీలైనంత త్వరగా కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, లేకుంటే దేశంలో కులాల మధ్య యుద్ధం తప్పదని హెచ్చరించారు.

శెట్టిగుంటలో వైభవంగా అంకాళమ్మ తిరుణాల

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలోని శెట్టిగుంట గ్రామంలో సోమవారం అంకాళమ్మ తిరుణాల అత్యంత వైభవంగా జరిగింది. శెట్టిగుంట గ్రామ ప్రజల, సర్పంచ్ సాలాపక్షి శివశైలజ ఆహ్వానం మేరకు కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి, సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి తనయులు సాయివికాస్ రెడ్డి, సింగమాల మహెంధర్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు వెళ్లి అంకాళమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అంకాళమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ముక్కారూపానందరెడ్డి బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అంకాళమ్మ తల్లికి పొట్టేళ్లను, కోడి పుంజులను బలి ఇచ్చి శాంతింప జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఛైర్మెన్ యర్రగుండ్ల జయప్రకాష్ ,ఎస్ఐ గొందిపల్లి నవీన్ బాబు, కానిస్టేబుల్ ముద్దలూరు సుధాకర్ రాజు,బిసి నాయకులు ఎస్ వి గోపాల్, బల్లేపల్లి భాస్కర్,కోలా సుబ్రమణ్యం, టిడిపి సీనియర్ నాయకులు యర్రగుండ్ల నీలకంఠయ్య, క్లస్టర్ ఇంఛార్జి వ్యవసాయ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నాగినేని వెంకటరమణ, బిజెపి మండల అధ్యక్షులు నాగినేని బాలసుబ్రమణ్యం, సాలాపక్షి చంద్రశేఖర్, మద్దిన గిరినాయుడు, హెూంగార్డు శ్రీనివాసులు, స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొని అంకాళమ్మ తల్లికీ మంగళారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. శెట్టిగుంట గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కొండాపురం: ప్రభుత్వం ఆదేశాల మేరకు పౌర గ్రంధాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరంను విద్యార్ధులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంధాలయ అధికారి వరలక్ష్మి కోరారు. వేసవి సెలవులు దృష్ట్యా ఏప్రిల్ 28వ తేది నుండి జూన్ 6వ తేది వరకు స్థానిక గ్రంధాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటుచేయడమైనదని ఇందులో కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు సంబంధించినవి అందుబాటులో ఉంటాయి అని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి.కోడూరు గ్రంధాలయ అధికారి రామమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

తహసిల్దార్‌కు ఆర్టీసీ కార్మికులు వినతి

విశాలాంధ్ర -రాజంపేట: రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీలో ఉన్నటువంటి అపరిష్కృత సమస్యల పరిష్కారంపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 33 డిమాండ్ల పైన యాజమాన్యానికి లెటర్ ఇచ్చి న్నప్పటికి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోవడంతో రాజంపేట డిపో కమిటీ మరియు గ్యారేజ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు రాజంపేట తాసిల్దార్ పీరు మున్ని నీ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. 1/ 2019 సర్క్యులర్ అమలు చేయాలని మహిళలకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని, వెంటనే ప్రమోషన్లు కల్పించాలని , గ్యారేజ్ నందు సరైన పనిముట్లు కనిపించాలని, అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, పారదర్శకమైన ట్రాన్స్ఫర్ పాలసీని అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సులు అనుమతించాలని ,ఏ పీ ఎస్ ఆర్టీసీలో ఉన్న కేడర్స్ టెన్ను అమలు చేయాలని, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాసిల్దార్ కు ఇచ్చిన వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట తాలూకా ఏపీ జే ఏసీ చైర్మన్ ఎస్ వి. రమణ, రాజంపేట డిపో కార్యదర్శి రమణ, డిపో అధ్యక్షులు శివయ్య,డిపో కన్వీనర్ కేహెచ్ ప్రసాద్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ జిబి రమణ, డిపో చైర్మన్ కేజీ ప్రసాద్, డిపో ఉపాధ్యక్షులు జయశంకర్, ఎమ్మెస్ శంకర్, డిపో ట్రెజరర్ బీజే ప్రకాష్, గ్యారేజ్ ట్రెజరర్ బిఎన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం సంధర్భంగా అవగాహణ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని అన్నారు. చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని, పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి మాట్లాడుతూ భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత, తుమ్మినప్పుడు, ఆటలు ఆడుకున్న తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. అంటువ్యాధులైన టైఫాయిడ్, పచ్చ కామెర్లు, కలరా, వాంతులు, వ్యాధులను నిర్మూళించవచ్చునని తెలిపారు. అనంతరం పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది మరియు ట్రైనింగ్ స్టాఫ్ స్టూడెంట్స్, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

విశాలాంధ్ర-కొండాపురం: జాతీయ రహదారి-67 ముద్దనూరు నుండి తాడిపత్రి వరకు సుమారు 50కిలో మీటర్లు 4లైన్ల రహదారిగా విస్తరించారు. దీనితో ఈ మార్గం గుండా వెళ్లే వాహణాలు అతి వేగంగా వెళ్తున్నాయి. కొండాపురం ఊరు రోడ్డుకు ఇరువైపులా విస్తరించడంతో రోడ్డు దాటే సమయాల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతున్న భార్యభర్తలు ప్రమాదానికి గురి కావడంతో ఇరువురు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకున్న సంధర్భంగా ప్రమాదాల నివారణకు కొండాపురం ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తగు చర్యలు చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వాహణదారులు అతివేగంగా ప్రయాణం చేయడం వల్ల ప్రమాదాలు జరిగితే దాని వల్ల సంభవించే నష్టం ఎక్కువగా ఉంటుంది. కుటుంబ సభ్యులను, బాధ్యతలు గుర్తించుకొని వాహణాలు నెమ్మదిగా నడపాలని సూచించారు. అదేవిధంగా స్థానికులు రోడ్డు దాటే సమయంలో రోడ్డుపై వచ్చే వాహణాలను గమనిస్తూ వెళ్లాలని తెలియజేశారు.

3 లక్షల 6వేల 648 రూపాయల విరాళం

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ కురవపల్లికు చెందిన చెందిన దేవపట్ల సతీష్ కుమార్ రెడ్డి యూఎస్ఏ శివాలయం ప్రహరీ గోడ నిర్మాణం కొరకు విరాళంగా మూడు లక్షలా ఆరువేల ఆరువందల నలభై ఎనిమిది రూపాయలు టెంపుల్ డెవలప్మెంట్ కమిటీ అకౌంట్‌కు జమ చేశారు.వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ పరమ శివుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని భవిష్యత్తు లో జరగబోయే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. అలాగే విరాళం అందజేసిన వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు.

జోరుగా ఆక్రమణలు - దోబూచులాడుతున్న అధికారులు :ఏఐవైఎఫ్

విశాలాంధ్ర- బ్రహ్మంగారిమఠం : మండలం కేంద్ర పరిధిలోని ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం లో సాదు సత్రం మరియు దేవస్థాన భూముల్లో అక్రమ నిర్మాణాలు చేయడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దుల్లపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ స్థానిక బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో పుణ్యక్షేత్రానికి కేటాయించిన భూములు సత్రాలకు కేటాయించిన స్థలాలు ఎండ్ల తరబడి ఆక్రమించుకొని అనుభవిస్తు, పైగా ఆ స్థలంలోనే అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న భూ కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు దేవాదాయ శాఖ అధికారులు వంతపాడడం దురదృష్టకరం. సంవత్సరము నుండి సాదు సత్రం లీజుకు తీసుకొని ఇప్పటివరకు సత్రంలో స్కూల్ నడుపుకుంటూ ఎటువంటి లీసు డబ్బులు చెల్లించకుండా పైగా ఆస్తలం లోనే అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకొని ఆ స్థలాన్ని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనపరచుకొని దేవాలయానికి భక్తుల సౌకర్యార్థం వాడుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక రాజకీయాలకు తలోగ్గి రెవెన్యూ అధికారులు దీర్ఘకాల సెలవులు పెట్టడం సమంజసం కాదని దీనిపైన జిల్లా కలెక్టర్ గారు వెంటనే చర్యలు తీసుకోవాలని సత్రాలను లీజుకి ఇవ్వడం ఇవ్వడం కరెక్ట్ కాదని సత్రాలు మరియు పుణ్యక్షేత్రానికి చెందిన స్థలాలు దేవస్థానానికి భక్తులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు వైసిపి, టిడిపి రాజకీయాలు దొందు దొందే అనేవిధంగా స్థానిక రాజకీయాలు ఉన్నాయని,ఆ కోణం లోనే స్థానిక రాజకీయాన్ని ఉపయోగించి సత్రాలు ఆక్రమించుకోవడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. ఈ సత్రాలు మరియు దేవస్థాన భూములు వ్యక్తులకు లీజుకు ఇవ్వకుండా దేవాదాయ శాఖా వారు దేవస్థానానికి ఉపయోగించాలని వారు కోరారు.ఆక్రమణలో ఉన్న భూములను, సత్రలను స్వాధీన పరుచుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో గందరగోళ పరిస్థితులను కల్పిస్తోందని, వాటిని వెంటను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేష్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణ విధానాలతో పాఠశాల విద్యకు నష్టం కలుగుతుందని, గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు నెలకొల్పితే ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కో రకమైన విద్యార్ధి ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 1 నుండి ఐదు తరగతుల వరకు మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలని, ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మరియు 6,7,8 తరగతులు ఉన్న చోట 6స్కూల్ అసిస్టెంట్ పోస్టులను జీఓ 55ప్రకారం కొనసాగించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్ధుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామోపాధ్యాయుడి పోస్టును మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న విడతల డీఏలను వెంటనే ప్రకటించాలని, 11వ పీఆర్సి బకాయిలను మరియు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్ని రకాల ఆర్ధిక బకాయిలను వెంటనే చెల్లించాలని, బదీలలను మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మే 9వ తేదిన జిల్లా కేంద్రాలలో ధర్నాలు, 14వ తేదిన విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్ రెడ్డి, మునివర్ధన్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, కుళాయి రెడ్డి, ఆడికట్ కమిటి, సభ్యులు, ప్రొద్దుటూరు మున్సిపల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్ రెడ్డి, కొండల్ రెడ్డి, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా డి. మహమ్మద్ ఎన్నిక

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.మహమ్మద్ ను నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ కు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్ లోని ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్రం కార్యాలయంలో ఏఐ ఆర్ఆర్ బిఇఎ జాతీయనాయకులు ఏపీటి ఆర్ ఆర్ బి ఇ ఎ అధ్యక్షులు బి.రవికాంత్,టిజిబిఇయు అధ్యక్షులు పి. వేణురావు,ఎన్ఎఫ్ఆర్ ఆర్ బిఇ ఏ జాయింట్ సెక్రటరీ పి.వి రాహుల్ తేజ్ ల ఆధ్వర్యంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్లు లతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో ఏకగ్రీవంగా కామ్రేడ్ డి.మహమ్మద్ ను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ కు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కామ్రేడ్ డి.మహమ్మద్ మాట్లాడుతూ నాయకులు,మా మాతృ సంస్థ ఏఐ ఆర్ఆర్ బిఇఎ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వర రెడ్డి అవిశ్రాంత అలుపెరుగనిపోరాటం ఫలితమే ఈ బ్యాంకు ల విలీనం మరియు ఈనాడు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అన్నారు.ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం యాజమాన్యం తో ఎక్కడ రాజీలేని పోరాటం చేస్తామన్నారు.అన్ని గ్రామీణ బ్యాంకులతో మమేకమైకలిసి చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తమ శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కామ్రేడ్ ఇ. హనుమంత రెడ్డి, సీజీబి,ఎస్జిబి, ఏపీ జి వి బి బ్యాంకు ల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి వైవీయూ డిగ్రీ పరీక్ష వాయిదా

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల బిఏ బీకాం, బీఎస్సీ ,బీసీఏ ,బి బి ఏ ,ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల కు ఈ నెల ఏడో తేదీన జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు వెల్లడించారు. ఈనెల 7వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఐసెట్ పరీక్ష ఉందన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, యోగివేమన విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వాయిదా వేసిన పరీక్షలను ఇదే నెల 23వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ నిర్వహిస్తే అడ్డుకుంటాం-ఏబీవీపీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండలా మారిన జీవో 77ను రద్దు చేసి, ఆ తర్వాతే ఈ ఏడాది ఐసెట్ ను నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరణ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రొద్దటూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర లో మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వస్తానే విద్యార్థులకు గుడిబండల ఉన్న జీఓ నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక విద్యా సంవత్సరం ముగిసిపోయిందని, లోకేష్ హామీ నెరవేర్చకుండా విద్యార్థులకు కల్లబొల్లి మాటలు చెపుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది నిర్వహించే ఐసెట్ కు ముందే జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలని, లేని పక్షంలో ఐసెట్ పరీక్ష ను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ ప్రెసిడెంట్ శివ నారాయణ, నితిన్, వెంకటేష్, శ్రావణ్, సుదర్శన్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రైల్వే ఐఆర్‌టిఎస్ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని సోమవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నందు రైల్వే ఐఆర్‌టి ఎస్ శ్రీకాంత్ రెడ్డి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మీదుగా వెళుతున్న సంపర్క్ క్రాంతి ఎక్స్ప్రెస్ రాజంపేట రైల్వే స్టేషన్‌లో కూడా ఆపేందుకు చర్యలు తీసుకోవాలని ఆయనకు సూచించారు. ఇందుకు వెంటనే స్పందించిన రైల్వే ఐఆర్ టి ఎస్ శ్రీకాంత్ రెడ్డి తమరు చెప్పినట్లు సంపర్క్ క్రాంతి ఎక్స్ప్రెస్ రాజంపేట రైల్వే స్టేషన్ లో ఆపేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

మంత్రిని కలిసిన బీసీ నాయకులు

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : అన్నమయ్య జిల్లా రాయచోటీ స్టేట్ గెస్ట్ హౌస్ నందు రవాణా యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని అన్నమయ్య జిల్లాలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు డి పద్మ యాదవ్ మరియు సంఘ నాయకులు కలిసి రాయచోటి నందు బీసీ సంఘానికి, బిసి భవనం నిర్మించాలని అందువలన బీసీల అభివృద్ధి మరియు బీసీల సమావేశాలు ఏర్పాటు చేయుటకు, జరుగుటకు వినతి పత్రము సమర్పించినారు .ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవఅధ్యక్షులు పివి రమణ, గౌరవ అధ్యక్షురాలు ఎం రమ ,వర్కింగ్ ప్రెసిడెంట్ టీవి రమణ ,సెక్రటరీ బి సాంబశివ ,జాయింట్ సెక్రెటరీ పి జయరాం,మరియు వైస్ యూత్ ప్రెసిడెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ర్యాంకర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే పుత్తా

విశాలాంధ్ర-చెన్నూరు : చెన్నూరు గ్రామానికి చెందిన సివిల్ ర్యాంకు (151) సాధించిన నేలటూరు శ్రీకాంత్‌రెడ్డిని కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఘనంగా సత్కరించారు. స్థానిక నేతలు కల్లూరి విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, డీసీఎంఎస్ ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మైనార్టీ నాయకులు షబ్బీర్, మరికొంతమంది నాయకులతో కలిసి ఘనంగా సత్కరించడం జరిగింది. గ్రామానికి పేరుప్రతిష్టలు తీసుకువచ్చిన నువ్వు గ్రామానికి ఆదర్శంగా నిలిచావని నిన్ను మరికొంతమంది యువకులు ఆదర్శంగా తీసుకొని ఇలాంటి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. వారి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కమలాపురం ఎమ్మెల్యేను కలిసిన డీసీసీ బ్యాంకు చైర్మన్

విశాలాంధ్ర -అట్లూరు: కడప ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ గా మంచూరు సూర్యనారాయణ రెడ్డి నూతనంగా నియమితులైన సందర్భంగా కమలాపురం శాసనసభ్యులు పుత్త చైతన్య రెడ్డిని సోమవారం కడప నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అలాగే తనకు డీసీసీబి చైర్మన్ పదవి ఇచ్చేందుకు సహకరించినందుకు పార్టీకి విధేయతగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైతన్య రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి సుముచిత స్థానం కల్పించే బాధ్యత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రినారా లోకేష్ బాబు తీసుకుంటారని తెలిపారు. తెలుగుదేశంపార్టీ కోసం డీసీసీ బ్యాంకు అభివృద్ధి కోసం అహర్నిశలు మరింత కష్టపడాలని మంచూరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గురు ప్రసాద్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు కమిషనర్ కు సమ్మె నోటీసు

విశాలాంధ్ర -రాజంపేట: మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 తేదిన చేపడుతున్న దేశవ్యాప్త సమ్మె కు కార్మికులందరూ హాజరవుతున్నామని తెలుపుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పివి రమణ,లక్ష్మీదేవి, ఓబయ్య,ప్రసాదు, ఎంవి రమణ లు మాట్లాడుతూ లేబర్ కోర్సు రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఆఫ్ కాష్ ప్రైవేటు ఏజెన్సీలను అనుమతించవద్దని, మునిసిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ ఎన్.ఎం.ఆర్ బదిలీ కోవిడ్ క్లబ్ డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, డెత్ సిక్కు ఆఫ్ కాల్స్ ద్వారా రిటైర్మెంట్ చేసిన కార్మికులకు పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాట్యూటీ చెల్లించాలని,సమ్మె కాలంలో ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని, పి ఆర్ సి కమిటీని వెంటనే నియమించాలని, మున్సిపల్ కార్మికులకు జీవో నెంబర్ 1615 ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మంగారి ఉత్సవం

గజ వాహననోత్సవం బ్రహ్మంగారి గోవింద మాంబ

విశాలాంధ్ర -బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయంలో ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన గురు పూజ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి అందులో భాగంగానే ఉదయం తెల్లవారుజాము నుండి బ్రహ్మంగారి సుప్రభాత సేవలు నామార్చన సంకీర్తన అభిషేకాలు 10 గంటలకు ఉత్సవము రాత్రికి హరికథ కళాక్షేపం, 10 గంటలకు గజ వాహన నోత్సవం కార్యక్రమాలను ఏర్పాట్లు బ్రహ్మంగారి ఆలయం ఫిట్ పర్సన్, శంకర్ బాలాజీ పర్యవేక్షణలో దేవస్థానం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆధ్వర్యంలో దర్శనాలకు వచ్చేభక్తులకు ప్రత్యేకంగా వసతులు పాటు, ప్రత్యేక చలో పందిళు ,, విద్యుత్ అలంకరణ దీపాలు, క్యూ లైన్ లో వెళ్లే భక్తులకు వేసవిని ఉద్దేశించిమజ్జిగలు మంచినీళ్లు హెయిర్ కూలర్స్, ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు.

భక్తులకు మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటుచేసిన కానాల

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని తెలుగు గంగ ప్రాజెక్టు వెళ్లే దారిలో బ్రహ్మంగారి ఆరాధన గురు పూజ మహోత్సవము వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న భక్తులకు ఉద్దేశించి మజ్జిగ ప్రతిరోజు ఉత్సవాలు ముగింపు వరకు పంపిణీ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, కావాల మల్లికార్జున రెడ్డి వారి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఈ కేంద్రాన్ని మైదుకూరు శాసనసభ్యులు, పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ సందర్భంగా, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు వివిధ రాష్ట్రాలప్రాంతా నల్లమూలల నుండి భక్తులు తరలివస్తుండడంతో అధికంగా వేసవి లోఎండలు ఉండడంతో భక్తులకు దాహం తీర్చుకునేందుకు ఉచితంగా ప్యాకెట్లను మజ్జిగను నాలుగో తేదీ నుండి 9వ తేదీ వరకు ప్రతిరోజు పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు ఈ కార్యక్రమానికి మైదుకూరు శాసనసభ్యులు హాజరై వారి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో, తెలుగుదేశం పార్టీ, అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం సీనియర్ నాయకులు యల్లటూరు సాంబశివారెడ్డి, పూజ శివ యాదవ్ లగసాని గంగరాజు సుధాకర్ యాదవ్ నాగయ్య యాదవ్ పాల్గొన్నారు.

కంచర్ల శ్రీకాంత్ ను కలిసిన డీసీసీ బ్యాంక్ చైర్మన్

విశాలాంధ్ర- అట్లూరు: ఉమ్మడి కడప జిల్లా నూతన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ను కలిశారు. సోమవారం ప్రకాశం జిల్లాలోని కందుకూరులో ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఇంజనీరింగ్ కళాశాలలో కాసేపు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తో మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఏకాంతంగా గంటసేపు గడిపారు. అనంతరం తన ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నూతన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నీ వేద పండితుల చేత ఘనంగా గజ మాలలతో సత్కరించి దుశ్యాలు వాళ్ళతో వేద మంత్రాలతో వేద పండితుల చేత ఆశీర్వదించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల క్రియాశీల నాయకులు ఆరవ శ్రీనివాసులురెడ్డి ,గురు ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు రూ.35వేలు ఇవ్వాలి-ఏఐటీయూసీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రభుత్వ రంగ సంస్థలో పని చేస్తున్నటువంటి పర్మినెంట్, కాంట్రాక్స్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి కనీస వేతనాలు 35వేల రూపాయలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు అన్నారు. సోమవారం ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దర్ కార్యాలయం ఎదుట పట్టణ సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అక్రాయిడ్ కమిటి నివేదిక ఆధారంగా ఉద్యోగ కార్మికులకు బేసిక్ పే కనీసం 35వేల రూపాయలు ఉంటేనే వారి జీవనం సాగుతుందని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు, స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు, వినోదం తదితరమైన ధరలు అమాంతం పెరిగిపోయాయని దీనితో రూపాయి విలువ పతనం అయిందని కొనుగోలు శక్తి కార్మికులకు లేకుండా పోతుందన్నారు. పౌష్టికాహారం ప్రతి కార్మికుడికి అందించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని డాక్టర్ అక్రాయిడ్ కమిటి తెలిపిందన్నారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్నటువంటి పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్ పే ను పెంచాలని, అదేవిధంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిల వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. దానితో పాటు ప్రభుత్వాలు మారే కొద్ది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై రాజకీయ పెత్తనాలు అధికమై పనిబధ్రత లేకుండా చేస్తున్నారన్నారు. దీనితో ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఈ సిబ్బంది భద్రత భావంతో కొట్టుమిట్టాడుతున్నారని పట్టణంలోనూ స్కూల్ స్వీపర్లను 14మందిని రాజకీయ వేధింపులతో ఆపేశారని తక్షణం వీరిని విధుల్లోకి తీసుకోవానలి వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు బి.మధు, యోసోడు, రమీజా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ప్రసూతి

సెలవులు పెంపు - టిఎన్‌యుఎస్ హర్షం

విశాలాంధ్ర-రామాపురం: మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రసూతి సెలవులను 180 రోజులకు (ఆరు నెలలకు) పెంచుతూ, ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా ప్రసూతి సెలవులకు అర్హత ఇస్తూ జీవో 21విడుదల చేయడం పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంజీవరెడ్డి మరియు రామచంద్ర ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు మరియు రాష్ట్ర రవాణా మరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చుతూ ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపారు.

వైయస్ షర్మిల రెడ్డి 12న కడపకు రాక

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి 12వ తేదీన కడప వస్తున్నట్లు విజయ జ్యోతి తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరాభవన్లో నాయకులు, కార్యకర్తల సమావేశంలో విజయ జ్యోతి మాట్లాడుతూ షర్మిల రాక సందర్భంగా ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నాయకులతో షర్మిల పార్టీ అభివృద్ధికి దిశా నిర్దేశం నిర్దేశం చేస్తారన్నారు. పర్యటన పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్ డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ కదిరి ప్రసాద్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గౌస్ పీర్, అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం విజయ జ్యోతి జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార నిమిత్తం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ కదిరి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన లక్ష్మీ రెడ్డి కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: మంత్రి లోకేష్‌ను సోమవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసిన ఆలం ఖాన్ పల్లి లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27 28 29వ తేదీలలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమం కడప లో ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో నారా లోకేష్ పాదయాత్రలో అడుగడుగున అడ్డుకున్నప్పటికీ కడపలో పాదయాత్రకు ఏ విధంగా మా కుటుంబం సహాయ సహకారాలు అందించిందో అదే తరహాలో మహానాడు కూడా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని నారా లోకేష్‌తో వివరించామని తెలిపారు. ఆయన కూడా స్పందిస్తూ మనం దరం కలిసికట్టుగా పనిచేసి మహానాడు ను విజయవంతం చేయాలని తెలిపారని ఆయన అన్నారు. ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం పార్టీ మహానాడు కార్యక్రమంలో ఏ బాధ్యత అప్పగించిన మహానాడుకు మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ రుణాలు నుండి విముక్తి కల్పించాలి

- పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించాలి
- డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసే వరకు పోరాటమే
- అతుల్ కుమార్ అంజన్‌కు ఘనమైన నివాళి
- ప్రధమ వర్ధంతి సభలో గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర-కడప రూరల్: విద్యార్థి దశ నుండే ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించి రైతాంగ సమస్యలపై ప్రధానంగా పంటలకు గిట్టుబాటు ధర కల్పించే అంశంపై ఏర్పాటు అయిన డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు కోసం చివరి వరకు అవిశ్రాంతంగా పోరాటాలు నిర్వహించిన రైతు ఉద్యమ నేత అతుల్ కుమార్ అంజన్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన అతుల్ కుమార్ అంజన్ మా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ అతుల్ కుమార్ అంజాన్, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శిగా మరియు అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శిగా రైతాంగ ఉద్యమాల్లో ప్రముఖ నాయకుడిగా నిలిచారు అన్నారు. అతుల్ కుమార్ అంజన్ 1955 ఏప్రిల్ 28న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జన్మించారు. లక్నో విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన ఆయన, 1967లో గ్రాడ్యుయేషన్, 1972లో పీజీ, 1976లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1977లో లక్నో విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1978 నుండి 1985 వరకు వరుసగా నాలుగుసార్లు అధ్యక్షుడిగా సేవలందించారు. అలాగే, అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా, 1979 నుండి 1986 వరకు జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 1997లో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. రైతుల సమస్యలపై అవగాహన కలిగి, స్వామినాథన్ కమిషన్‌లో సభ్యుడిగా వ్యవసాయదారుల ప్రయోజనాల కోసం పనిచేశారు. స్వామినాథన్ కమిషన్ సభ్యత్వం: అటుల్ కుమార్ అంజాన్, రైతుల సమస్యలపై అధ్యయనం చేసిన స్వామినాథన్ కమిషన్‌లో సభ్యుడిగా పనిచేశారు. ఈ కమిషన్, రైతులకు కనీస మద్దతు ధర ను ఉత్పత్తి ఖర్చు కు 50% అదనంగా ఇవ్వాలని సిఫార్సు చేసింది, ఇది రైతుల ప్రధాన డిమాండ్‌గా మారింది. భూమి హక్కుల ఉద్యమం: 2015లో భూమి స్వాధీనం ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా భూమి హక్కుల ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ ఉద్యమం ద్వారా రైతుల భూమి హక్కులను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం జరిగింది. సంయుక్త కిసాన్ మోర్చాలో నాయకత్వం వహించి, రైతుల ఐక్యత కోసం పనిచేశారు. 2022లో జరిగిన ఏఐకేఎస్ సదస్సులో, ఎస్ కే యం నాయకులు రాకేష్ టికాయత్, రాజారామ్ సింగ్‌లతో కలిసి, రైతుల ఐక్యతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2021లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏఐకేఎస్ తరఫున రైతుల నిరసనలను సమన్వయం చేశారు. జనవరి 26న ఢిల్లీలో జరిగిన ట్రాక్టర్ ర్యాలీ వంటి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అంతర్జాతీయ రైతు సంఘాల ఐక్యత కోసం కూడా కృషి చేశారు. దక్షిణాసియా రైతు సంఘాలను సమన్వయం చేయడంలో ఆయన పాత్ర ఉంది. రైతుల సంక్షేమానికి అనేక విధాలుగా కృషి చేశారు. రైతులకు పింఛన్, రుణ మాఫీ, విద్యుత్ బిల్లుల మాఫీ వంటి డిమాండ్లపై ఉద్యమాలు నిర్వహించారు. అలాగే, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల, ఎరువుల ధరల పెరుగుదల వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అటుల్ కుమార్ అంజాన్, రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు. ఆయన చేసిన కృషి, రైతాంగ ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యంవి సుబ్బారెడ్డి, పి భాస్కర్, సిపిఐ నగర కార్యదర్శి ఎన్ వెంకటశివ, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి వేణుగోపాల్ ఎల్ నాగసుబ్బారెడ్డి, కేసి బాదుల్లా, విజయలక్ష్మి, మునయ్య,సుభాషిణి, పి ప్రభాకర్, తేజ, అరుణ్, నాగార్జున, బాలచంద్రయ్య, పి చంద్రశేఖర్ రెడ్డి, పక్కెరప్ప తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి శుద్ధినీటి కేంద్రాలు

- ఎమ్మెల్యే ఆది, ఇన్‌చార్జి భూపేష్ సహకారంతో అభివృద్ధి
- టీడీపీ మండల బాధ్యులు మేకల మోహన్

విశాలాంధ్ర-యర్రగుంట్ల: మండల పరిధిలోని మాలేపాడు గ్రామంలో శుద్దినీటి కేంద్రాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం టీడీపీ మండల బాధ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గ్రామానికి చెందిన మేకల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రెండు శుద్దినీటి కేంద్రాలు మరమ్మత్తులకు గురై అందుబాటులో లేని కారణంగా స్థానికులు అటు కలమల్ల, ఇటు పోట్లదుర్తికి తాగునీటి కోసం వెళ్లాల్సి వచ్చిందని గుర్తుచేశారు. అయితే ఓ శుద్దినీటి కేంద్రానికి మరమ్మత్తు పనులు చేసి అందుబాటులోకి తేవడం జరిగిందని మరొకటి కూడా మూడు రోజుల్లో అందుబాటులోకి తేవడం జరుగుతుందని మోహన్‌రెడ్డి వివరించారు. రెండు కేంద్రాలు అందుబాటులోకి తేవడం ద్వారా గ్రామస్తుల తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిస్తామని ఆయన అన్నారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఓ వైపు ప్రభుత్వం చెబుతుండడం మరోవైపు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నియోజకవర్గ బాధ్యులు భూపేష్ రెడ్డి పదే పదే సూచిస్తున్న నేపథ్యంలో గ్రామంలో వెలగని వీధి దీపాలకు మరమ్మత్తు పనులు చేపట్టి అంధకారాన్ని తొలగించడం జరుగుతుందని మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హిందు, ముస్లిం, క్రిస్టియన్ వర్గాల స్మశాన వాటికల్లో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరచడం జరుగుతుందన్నారు. ఒంగిన కరెంటు స్థంభాలు, క్రిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడం వంటి పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఆది, ఇన్‌చార్జి భూపేష్ సహకరిస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సమకూరుతాయని మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

20వ శతాబ్దపు మేధావి కారల్ మార్క్స్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ప్రపంచ గమనాన్ని మలుపు తిప్పిన కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కామ్రేడ్ కారల్ మార్క్స్ జననం ఒకటని, ఆయన జననం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పోరాట బీజాలు మొలకత్తాయని, ఆ పోరాటాలు ప్రపంచ నలుమూలలకు అత్యంత వేగంగా విస్తరించాయని ఆయన ప్రపంచ కార్మికులకు పేదలకు ఆరాధ్యుడిగా నిలిచిపోయాడని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుండి, రాజీవ్ మార్క్ వరకు మార్క్స్ చిత్రాల ప్రదర్శన ర్యాలీ ఘన నివాళిలు, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచాన్ని రెండు కాలాలుగా విభజించడానికి క్రీస్తు ప్రభువు మొదటి కారణమైతే! ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికుల అంతా ఏకమై పోరాటాలకు సన్నద్ధం కావాలని పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మికులారా ఏకం కండిని పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న నినాదంతో ప్రపంచ ప్రజలను నిద్రలేపి ఐక్యం చేసిన పోరాట యోధుడు కారల్ మార్క్స్ రెండవ విభజన కారకూడనిఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో ఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, ఆర్సిపి నగర కార్యదర్శి మక్బుల్ భాష, సికిందర్, డబ్ల్యూ రాము,నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, తస్లీమ్, లక్ష్మీదేవి, చాపల సుబ్బరాయుడు, రమేష్, బాల చెన్నయ్య, శ్రీనివాసులు రెడ్డి, విజయ్, రవి, గంగన్న, లోకేష్ రెడ్డి, మనిరెడ్డి, ప్రతాపరెడ్డి, చిన్నోడు, శంకరయ్య, ఓబులేసు, ఆర్ సి పి అనుబంధ ప్రజా సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యాపారంలో ముడిసరుకుగా ఇంటర్ విద్యార్థులు

- ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్: కడప నగరంలో సోమవారం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంగిస్తూ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాల తరగతులు భహిస్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి తేజ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య అత్యంత ఖరీదైన విద్యగా మారి ఈ విద్యా వ్యాపారంలో విద్యార్థులు ముడి సరుకుగా మారారని అన్నారు. రాష్టంలో ఇంటర్మీడియట్ బోర్డు వేసవి సెలవులు ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ వాటిని ఖాతర్ చేయకుండా నారాయణ శ్రీ చైతన్య పలు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు సెలవు దినాల్లో కూడా ర్యాంకుల కోసం సప్లిమెంటరీ, ఇమ్ప్రోటంట్,జెఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ కోచింగ్‌ల పేరుతో మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు రెండవ సంవత్సరం తరగతుల నిర్వహిస్తు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారు అలాగే ముందస్తు అడ్మిషన్ల పేరుతో పుస్తకాలకు విద్యార్థుల నుండి వేలకు వేలు రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థులను విద్యార్థుల తల్లి దండ్రులను దోపిడీ చేస్తున్నారు. విద్యార్థుల యొక్క మానసిక ఆరోగ్య పరిస్థితులను లెక్క చేయకుండా విద్యార్థులను స్వేచ్ఛ కు దూరం చేస్తున్న నారాయణ, శ్రీ చైతన్య మరియు పలు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో పై వెంటనే ఆర్ఐఓ చొరవ చేసి నిబంధన లకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హేచ్చరించారు. కార్యక్రమములో నగర అధ్యక్షులు అఖిరా నందన్, నగర సహాయ కార్యదర్సులు చంద్ర, అరుణ్, నగర ఉపాధ్యక్షులు అశోక్, మల్లికార్జున, నిఖిల్ నగర కోశాధికారి రాజేష్ నాయకులు సాగర్, పాల్గొన్నారు.